

## పెనుకొండ సబ్ కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి):** పెనుకొండ సబ్ కలెక్టర్‌గా మౌర్య భరద్వాజ్ నియమితుడయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న పలువురు ఐఏఎస్‌లకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్ ఇచ్చింది. అందులో భాగంగా మౌర్య భరద్వాజ్‌ను పెనుకొండ డివిజన్ సబ్ కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న సబ్‌కలెక్టర్ అపూర్వభరత్‌ను ఈనెల 17న బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

# వెన్నతినగ రావయ్యా.. చిన్ని కన్నయ్యా..



ప్రశాంతి నిలయం వద్ద ఏర్పాట్లు

### నేడు శ్రీకృష్ణాష్టమి
### ముస్తాబైన ఆలయాలు
### సందడి చేయనున్న చిన్నారులు

**పుట్టపర్తి, ఆగస్టు 25:** శ్రీకృష్ణాష్టమి వేడుకలకు జిల్లా ముస్తాబైంది. సోమవారం కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. పిల్లలను రాధాకృష్ణులుగా అలంకరించి తల్లిదండ్రులు మురిసిపోనున్నారు. అందుకు సంబంధించిన సామగ్రిని కొనుగోలు చేసి, సిద్ధం చేసుకున్నారు. చిన్నారులు.. రాధాకృష్ణుల వేషధారణల్లో సందడి చేయనున్నారు. హిందూపురంలోని వాసవీ ధర్మశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మధుర నుంచి ప్రత్యేకంగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని తెప్పించారు. సోమవారం ఘనంగా ఊరేగించనున్నారు.

**ప్రశాంతి నిలయంలో వేడుకలు ప్రారంభం**

ప్రశాంతి నిలయంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభమయ్యాయి. వైజాగ్‌కు చెందిన 2500 మంది భక్తులు పర్తియాత్ర చేపట్టి, ప్రశాంతి నిలయం చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో వారు కచేరి నిర్వహించారు. గంటపాటు భక్తిపాటలతో మైమరపింపజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రశాంతి నిలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వేడుకల్లో పాల్గొనడానికి వేలాదిమంది భక్తులు ఇప్పటికే ప్రశాంతి నిలయం చేరుకున్నారు.



ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహం



మధుర నుంచి తీసుకొచ్చిన చిన్ని కృష్ణుడి విగ్రహం

# అనంత ప్రజలకు అధునాతన వైద్యం..!

## ఆస్పత్రి నిర్మాణానికి రెడ్‌క్రాస్ సొసైటీ అడుగులు

- తక్కువ ధరకే వైద్యసేవలు
- అందుబాటులోకి రానున్న కేన్సర్ విభాగం
- పాలసముద్రం వద్ద స్థల పరిశీలన

**హిందూపురం, ఆగస్టు 25:** ఉమ్మడి అనంత జిల్లా ప్రజలకు ఇది తీపికబురు. అత్యాధునిక వైద్యసేవలు అందించే దిశగా రెడ్‌క్రాస్ సొసైటీ అడుగులు వేస్తోంది. గోరంట్ల మండలం పాలసముద్రం సమీపాన జాతీయ రహదారి పక్కనే అధునాతన సౌకర్యాలతో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో క్యాన్సర్ పరీక్షలు, వైద్యం కూడా చేయనున్నారు. తక్కువ ధరలో అత్యాధునిక వైద్యసేవలు అందించనున్నారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మినహా ఎక్కడా అత్యాధునిక వైద్యశాల లేదు. ఈ తరుణంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాలో అధునాతన ఆస్పత్రి నిర్మాణం చేపట్టడానికి ముందుకొచ్చింది. అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం సుముఖత తెలిపింది. సుమారు రూ.8కోట్ల నిధులతో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు.

**ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న విభాగాలు**

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద నిర్మించ తలపెట్టిన ఆస్పత్రిలో ముఖ్యంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. మిగతా ఆస్పత్రుల ధరల కంటే 80 శాతం తక్కువకే పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఈ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలంటే బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలాంటి నగరాలకు వెళ్లాలి. ఈ నేపథ్యంలో రెడ్‌క్రాస్ ఆస్పత్రిలో క్యాన్సర్ విభాగం ఏర్పాటు చేయనుండడం జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనకరం. బ్లడ్‌బ్యాంకుతోపాటు వివిధ వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు చేస్తారు. కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రి ఉన్నా.. సామాన్యులకు అందుబాటులో ధరలు నిర్ణయించనున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ పరిపాలనా విభాగ భవనం కూడా ఇక్కడే ఏర్పాటు చేయనున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, జీఎం శేఖర్ (ఫైల్)

**సీఎస్ఆర్ నిధులతో..**

సాధారణంగా కార్పొరేట్ సంస్థలు ఆర్జించే లాభంలో కొంతమొత్తాన్ని సమాజహితం, ప్రజాసేవకు ఉపయోగించాలి. దీనినే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) అంటారు. కంపెనీలు ఆర్జించిన లాభాల్లో రెండు నుంచి ఐదుశాతం వరకు సామాజిక సేవకు ఖర్చు చేయాలని నిబంధనలు ఉన్నాయి. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కూడా అయిన జీఎం శేఖర్ చొరవతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో ఆస్పత్రి నిర్మాణానికి నిధులను సమకూర్చనున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యరంగంలో సేవలు విస్తరిస్తోంది. ఈ తరుణంలో కియ కార్ల కంపెనీ నుంచి సుమారు రూ.కోటి నిధులు సీఎస్ఆర్ కింద రాబట్టే అవకాశం ఉందని సమాచారం. జిల్లాలో ఇతర కంపెనీలు సైతం నిధుల కేటాయింపునకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**ఈ ప్రాంత వాసులకు సంజీవని**

వెనుకబడిన ఉమ్మడి అనంత జిల్లాలో పాలసముద్రం వద్ద అధునాతన ఆస్పత్రి నిర్మించ తలపెట్టాం. ఇది పూర్తయితే ఈ ప్రాంత సామాన్య, మధ్యతరగతి ప్రజలకు సంజీవనిలా పనిచేస్తుంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య పరీక్షలు, సేవలు అందుతాయి. ఇతర ఆస్పత్రులతో పోలిస్తే 80 శాతం తక్కువ ధరకే పొందవచ్చు.

**- జీఎం శేఖర్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు**



**స్థల పరిశీలన**

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలపెట్టిన అధునాతన ఆస్పత్రి నిర్మాణానికి గోరంట్ల మండలం పాలసముద్రం సమీపాన జాతీయ రహదారి పక్కనే సర్వేనంబరు 130/3లో 10.90 ఎకరాల భూమిని పరిశీలించారు. ఇందులో ఎకరా స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించేందుకు జిల్లా కలెక్టర్ సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది. శనివారం రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు.




# చెరువుల్లో చేలు!

- గత ప్రభుత్వంలో ఎకరాల కొద్దీ ఆక్రమణ
- కంచెలు వేసి.. పంటల సాగు
- ఇళ్లపట్టాలుగా మార్చి అమ్ముకునే యత్నాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

## వైసీపీ వర్గీయుల కబ్జాలపర్వం

గత వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా భూఆక్రమణలకు అడ్డేలేకుండా పోయింది. ఆ పార్టీ నాయకులు యథేచ్ఛగా ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. గుడి, బడి స్థలాలను కూడా వదల్లేదు. ఆఖరుకు చెరువులను కూడా చెరబట్టారు. దౌర్జన్యాలు సాగించారు. ఏకంగా ఎకరాల కొద్దీ ఆక్రమించారు. కంచెలు వేసి, హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. పట్టాలు లేకున్నా, ఎటువంటి హక్కూ లేకున్నా భూములను సొంతం చేసుకున్నారు. అందులో బోర్లు వేసుకుని, పంటలు కూడా పెట్టారు. కొందరైతే ఏకంగా ప్లాట్లు వేసి, అమ్మకానికి కూడా పెడుతున్నారు. వారి దెబ్బకు తాడిమర్రి తూర్పు, పడమర చెరువులు స్వరూపాన్నే కోల్పోతున్నాయి. కుంచించుకుపోయాయి. చెరువులను పూడ్చేందుకు ఏకంగా బండరాళ్లను తరలిస్తున్నారు. ఇలా.. ఆక్రమణల పర్వం యథేచ్ఛగా సాగుతున్నా.. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల ఆక్రమణలకు రెవెన్యూ అధికారులు అన్నివిధాలా సహకరించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. - తాడిమర్రి



తాడిమర్రి పడమటి చెరువులోకి తరలించిన బండరాళ్లు



ఇటీవల వేసిన బోరు

**భూములను స్వాధీనం చేసుకుంటాం**

చెరువులను సర్వే చేసి, ఆక్రమించినట్లు తేలితే ఆ భూములను స్వాధీనం చేసుకుంటాం. పట్టాలను కూడా రద్దు చేస్తాం. అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు వాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపడతాం. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు.

**- భాస్కర్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్, తాడిమర్రి**

### 30 ఎకరాల వరకు కబ్జా

రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించే ఉద్దేశంతో చెరువులను తవ్వించారు. అలాంటి చెరువులు కబ్జాకోరల్లో చిక్కుఉన్నాయి. మండలంలోని తాడిమర్రి తూర్పు, పడమర చెరువులు కుంచించుకుపోతున్నాయి. తాడిమర్రి పడమటి చెరువులో ఇప్పటికే ఏకంగా 25 బోరుబావులు తవ్వించారు. కొందరు ఆక్రమణదారులు చెరువుల్లోకి బండరాళ్లను తరలిస్తున్నారు. చెరువులను రక్షించాలని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని మండలవాసులు వాపోతున్నారు. 2016కు ముందు వరకు పడమటి చెరువులో ఒక్క బోరు లేదు. సెంటు భూమి కూడా కబ్జా కాలేదు. ప్రస్తుతం ఏకంగా చెరువులోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకుని, కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి నీటిని తరలిస్తున్నారు.

ఇటీవలి వరకు వర్షాభావ పరిస్థితులు నెలకొని, భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఆయకట్టు రైతులు.. చెరువుల్లో ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు. కొందరు రైతులు.. రెవెన్యూ అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెప్పి, కొత్తగా చెరువులో పట్టాలు పొందినట్లు సమాచారం. తూర్పు, పడమటి చెరువుల కింద కనీసం 500 ఎకరాల్లో పంటలు సాగువుతాయి.

పడమటి చెరువుకు నీరు చేరితే తాడిమర్రితోపాటు మద్దెలచెరువు, భీమరాయునిపేట, పుల్లానారాయణపల్లి, మేడిమాకులపల్లి, శివంపల్లిలో కొంతభాగం వరకు ఆయకట్టు సాగులోకి వస్తుంది. తూర్పుచెరువుకు నీరు చేరితే చిల్లకొండయ్యపల్లి, మోదుగులకుంట, బంగారంపేట, కునుకుంట్ల గ్రామం వరకు భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయి. చెరువులో బోర్లు తవ్వి, అక్రమంగా నీటిని తరలించడం మూలంగా దిగువ ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొందరు యథేచ్ఛగా చెరువులను ఆక్రమించడంతోపాటు బోర్లు వేసి, వాటికి అక్రమ కనెక్షన్లు పొందుతున్నా.. రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. తూర్పుచెరువుప్రాంతంలో కొందరు ఆక్రమించుకోవడంతోపాటు ఇంటిపట్టాలకు భూములను అమ్మే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. రెండు చెరువుల్లోనూ 30 ఎకరాల వరకు కబ్జా అయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ భూమి విలువ ఎకరం రూ.10లక్షలదాకా పలుకుతోంది. రెండేళ్లుగా చెరువులో పట్టాలు పంపిణీ చేయలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం మండలకేంద్రం చుట్టూ 2 కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వరాదు. ఇక్కడ మాత్రం యథేచ్ఛగా ఆ వ్యవహారం సాగిపోయింది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి చెరువు భూములను రక్షించడంతోపాటు చుట్టూ కందకాలు తవ్వించి, చెట్లు పెంచే కార్యక్రమం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పంట సాగుకు పరచిన డ్రిప్పు



తూర్పుచెరువులో సాగుచేస్తున్న చీనీ పంట

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి: కలెక్టర్

**పుట్టపర్తి, ఆగస్టు25:** మహిళలు ఎంచుకున్న రంగంలో రాణిస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ చేతన్ సూచించారు. లక్‌పతి దీదీ పథకం అమలు దిశగా ప్రధాని మోదీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. లఖ్‌పతి దీదీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, మహిళలు ఆదాయం పెంచుకోవాలన్నారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని, నచ్చిన రంగాల్లో మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. జిల్లాలో 2676 మందిని లఖ్‌పతి దీదీ పథకానికి అర్హులుగా గుర్తించి, ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. అందుకు రూ.22.13 కోట్ల మెగా చెక్కును కలెక్టర్ విడుదల చేశారు. జిల్లాలో ఐదేళ్లలో 9757 మందికి లఖ్‌పతి దీదీ పథకం వర్తింపజేయడమే లక్ష్యమన్నారు. అనంతరం ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు రుణాల పంపిణీకి సంబంధించి కలెక్టర్ మెగా చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎంలు రామ్మోహన్, రామిరెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సిద్దగంగమ్మ పాల్గొన్నారు.



మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

# వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

**మంత్రి సవిత**

రొద్దంలోని ఎంజేపీ, కేజీబీవీ పరిశీలన



అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత

**పెనుకొండ రూరల్, ఆగస్టు 25:** గత వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందనీ, విద్యార్థుల జీవితాలతో జగన్మోహన్‌రెడ్డి ఆటలాడుకున్నాడని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆరోపించారు. టీడీపీ హయాంలోనే విద్యార్థులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు. రొద్దం మండలంలోని ఆర్.మరువపల్లిలో గల ఎంజేపీ, కేజీబీవీని ఆదివారం మంత్రి తనిఖీ చేశారు. ముందుగా కేజీబీవీలో విద్యార్థినులు, సిబ్బంది అటెండెన్స్, తరగతి గదులు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులను అడిగి, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎంజేపీ స్కూల్‌లో అర్ధంతరంగా ఆగిపోయిన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలోనే ఎంజేపీ స్కూల్‌కు రూ.15 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. వైసీపీ హయాంలో భవన నిర్మాణాలు పునాదుల్లోనే ఆగిపోయాయన్నారు. వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో భవనాలకు రంగులు వేయడం, బటన్ నొక్కడం, సొంత పత్రికలకు ప్రకటన ఇచ్చుకోవడంతప్ప.. ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగానికి పెద్దపీట వేశారన్నారు. ఏదైనా సమస్యలుంటే ఒక్క ఫోన్‌కాల్ చేస్తే పరిష్కరిస్తామని విద్యార్థులకు మంత్రి సవిత భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీచర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి సవిత



ఖాళీగా ఉన్న స్టాల్స్

# ఖాళీ బజార్



● నిరుపయోగంగా రైతు బజార్ స్టాల్స్ ● కూరగాయలన్నీ పాతూరు మార్కెట్‌కే.. ● అవగాహన కల్పించని అధికారులు

**అనంతపురం రూరల్, ఆగస్టు 25:** రైతులు పండించిన కూరగాయలను వారే అమ్ముకునేందుకు వీలుగా జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన రైతు బజార్ నిరుపయోగంగా మారింది. పేరుకు మాత్రమే ఉంది తప్ప.. ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. రైతుబజార్ ఏర్పాటై ఏళ్లు గడుస్తోంది. ఇప్పటికీ రైతులు, వినియోగదారులు పెద్దగా రావడంలేదు. దీంతో వెలవెలబోతోంది. ఎప్పుడో టమోటా.. ఎర్రగడ్డల ధరలు ఎక్కువగా ఉన్న సమయంలో మాత్రం జనం అటువైపు వస్తారే తప్ప.. మిగిలిన సమయాల్లో కన్నెత్తి కూడా చూడరు. కూరగాయల కోసం పాతూరు మార్కెట్‌కు వెళుతుంటారు. అందరికీ అందుబాటులో ఈ రైతు బజార్ ఉంది. అన్ని రకాల స్టాల్స్ ఉన్నాయి. వాటిని రైతులు సద్వినియోగం చేసుకునేదిశగా సంబంధిత యంత్రాంగం అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. దీంతో సగానికి పైగా స్టాల్స్ ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు రైతుబజార్ ఉందనే విషయాన్నే మరచిపోయారు. ఏదో సందర్భంలో తప్పితే.. మళ్లీ అటు వెళ్లిన దాఖలాలు లేవు.



రైతుబజార్ ముఖద్వారం

## సగానికిపైగా స్టాల్స్ ఖాళీ..

రైతుబజార్‌లో 31స్టాల్స్ ఉన్నాయి. దుకాణాలు 20 ఉన్నాయి. షాపుల్లో మూడు మినహా అన్నింటిలోను వ్యాపారాలు సాగుతున్నాయి. స్టాల్స్ పరిస్థితి దయనీయంగా ఉంది. 31లో పదింటిలో కూరగాయల వ్యాపారం సాగుతోంది. మిగిలిన వన్నీ ఖాళీగానే ఉన్నాయి. వాస్తవానికి సంబంధిత అధికారులు చుట్టుపక్కల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించి.. తమ ఉత్పత్తులను రైతు బజారుకు తీసుకొచ్చి విక్రయించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఆ దిశగా ప్రయత్నాలు చేయని పరిస్థితులు కనిపిస్తున్నాయి. బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు బాగానే ఉంటున్నాయి. రైతులకు లాభం అంతంతే అన్న వాదనలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొంత అవగాహన కల్పించి రైతులే రైతుబజారులో విక్రయించుకునేలా చేస్తే ఇటూ రైతులకు.. అటు వినియోగదారులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. ఆ దిశగా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.



నిరుపయోగంగా ధరల డిస్‌ప్లే బోర్డు

## పనిచేయని ధరల డిస్ ప్లే బోర్డు..

రైతుబజారులో కూరగాయల ధరలు జనానికి తెలియజేయడానికి గత ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.5లక్షల వ్యయంతో ఎలక్ట్రిక్ డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. ఇంత వరకు అది పనిచేసింది లేదు. రాష్ట్రంలోని అన్ని రైతు బజార్లలో ఈబోర్డుల ఏర్పాటు కాంట్రాక్టు ఒక్కరే దక్కించుకున్నట్లు తెలుస్తోంది. అయితే సదరు కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం డబ్బు చెల్లించకపోవడంతో ఎక్కడికక్కడే వాటిని వదిలేసినట్లు తెలుస్తోంది. దీనికితోడు రైతు బజార్‌లో వర్షపు నీరు ఇతరాత్రా నీరు బయటకు వెళ్లేందుకు కాలువ ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం కాలువ పూర్తిగా దెబ్బతింది. దాని గురించి పట్టించుకునేవారు లేరు.

## అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం

ప్రతాప్‌రుద్రం: రైతుబజారు ఎస్టేట్ అధికారి

ఏటా గ్రామాల్లోకి వెళ్లి రైతులకు తమ ఉత్పత్తులను రైతు బజారులో విక్రయించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తమ ఉత్పత్తులు విక్రయించుకునేందుకు ఉచిత స్టాల్స్‌నూ కేటాయిస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



# ఉద్యోగుల్లో ఉత్కంఠ



పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయం

● నేడు పీఆర్ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ ● సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తారా..? ● విభాగాల మార్పు జరిగేనా..?

**అనంతపురం సిటీ, ఆగస్టు25 :** పంచాయతీ రాజ్ ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. స్థానిక జిల్లా పంచాయతీ కార్యాలయంలో పీఆర్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం జరగనుంది. ఈ బదిలీలకు రాయలసీమ జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల పంచాయతీ రాజ్‌శాఖలో వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులందరూ హాజరుకానున్నారు. ఈ పక్రియ ఆశాఖ ఈఎన్‌సీ బాలునాయక్ అధ్యక్షతన జరగనుంది. అయితే కౌన్సెలింగ్ పక్రియపై పీఆర్ ఉద్యోగుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది రేపుతోంది. ఎవరు, ఎక్కడికి బదిలీ అవుతారోనని ఆయా వర్గాల్లో చర్చగా మారింది.

**రాయలసీమ జోన్‌లో బదిలీల కౌన్సెలింగ్ వివరాలు**

| | |
|---|---|
| డీఈఈ | : 40 |
| ఏఈ,ఏఈఈలు | : 128 |
| టెక్నికల్ ఆఫీసర్స్ | : 4 |
| ఏటీఓలు | : 2 |
| జేటీఓలు | : 13 |
| సూపరింటెండెంట్‌లు | : 1 |
| సీనియర్ అసిస్టెంట్‌లు | : 3 |
| ఆఫీస్ సబార్డినేట్‌లు | : 4 |

● **గత వైసీపీ ప్రభుత్వంలో జోరుగా పైరవీలు..**

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు శ్రీకారం చుట్టడంతో ఆయా ఉద్యోగుల్లో ఆశలు రేకెత్తాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలా మందికి బదిలీల్లో అన్యాయం జరిగిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఎక్కువ శాతం పైరవీలు చేసి కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో పోస్టింగ్‌లు పొందినట్లు సమాచారం. ఈ సారి నిబంధనల ప్రకారం ఆయా ఉద్యోగులు బదిలీలకు సిద్ధమయ్యారు. నాలుగు జిల్లాల బదిలీలు అనంతపురం జిల్లా కేంద్రంలో జరుగుతుండటంతో మరింత ఆసక్తి నెలకొంది. గతంలో మాదిరిగా కాకుండా నేటి కౌన్సెలింగ్ పక్రియలో అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు ఉద్యోగులు భావిస్తున్నారు.

● **సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తారా..?**

బదిలీల కౌన్సెలింగ్‌లో సీనియారిటీకి ప్రాధాన్యం ఇస్తారా లేదా అన్న చర్చ ఆశాఖ వర్గాల్లో జోరుగా సాగుతోంది. డీఈఈ స్థాయి ఉద్యోగాలు ఎక్కువగా ఖాళీ ఉండటంతో ఆ పోస్టులపై తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఆ పోస్టుల కోసం ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఎక్కువ ఖాళీలు ఉండడం, రెగ్యులర్ డీఈఈలు తక్కువగా ఉండటంతో ఏఈ, ఏఈఈలకు ఎఫ్ఏసీ పేరుతో డీఈఈ పోస్టులు అప్పగించడం ఆనవాయితీ. ఇదిలా ఉండగా.. కింది స్థాయి ఉద్యోగులు ఎఫ్ఏసీ కింద డీఈఈలుగా పోవడంతో ఏఈఈ, ఏఈ స్థానాలు చాలా వరకు ఖాళీగా ఉండడం.. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు కూడా ఆశించిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలు లేకపోలేదు.

**విభాగాల మార్పు జరిగేనా..?**

పంచాయతీ రాజ్‌శాఖలో పీఆర్ఐ, పీఐయూ, క్యూసీ విభాగాల్లో ఏళ్ల తరబడి ఉద్యోగులు అదే శాఖలోనే ఉండిపోయారు. వేరే విభాగాలకు మాత్రం బదిలీ కావడం లేదు. ఉదాహరణకు.. పీఆర్ఐలో పనిచేస్తున్న వారు అదే పీఆర్ఐలోని మరో డివిజన్‌కు బదిలీ అవుతున్నారే కానీ.. క్యూసీ, పీఐయూ విభాగాలకు బదిలీ కావడం లేదు. అదే తరహాలోనే పీఐయూ, క్యూసీ విభాగాల్లోనే అదే పక్రియ ఉందని తెలుస్తోంది. వీటికితోడు నిత్యం ఆఫీస్ విభాగాల్లో పనిచేసే వారు కూడా అదే ఆఫీస్ విభాగాలకు బదిలీ అవుతున్నారు కానీ.. ఫీల్డ్‌కు బదిలీ కావడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. ప్రధానంగా నిబంధనలు ప్రకారం.. ఐదేళ్ల దాటిన వారిని మాత్రమే బదిలీ చేయాలన్న నిబంధన ఉంది. కాకపోతే అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ పేరుతో.. రెండు, లేదా మూడేళ్ల పనిచేసిన వారిని కూడా బదిలీ చేస్తారా..? అనే సందేహాలు నెలకొన్నాయి. ప్రత్యేక దృష్టి సారించి న్యాయం చేయాలని ఆయా ఉద్యోగులు కోరుతున్నారు.

● **అధిక ఖాళీలతో ఎఫ్ఏసీ పక్రియ...**

పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల పరిధిలోని డీఈఈ, ఏఈ, ఏఈఈ తదితర విభాగాల్లో అధిక శాతం రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ప్రభుత్వాలు ఎఫ్ఏసీ పక్రియ అమలు చేస్తున్నారు. ఆయితే ఈ క్రమంలో చాలా వరకు రెగ్యులర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆరోపణలు లేకపోలేదు. ఈ బదిలీల్లో అందరికీ న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర నాయకులు

## వ్యవసాయ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

● జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



**అనంతపురం అర్బన్, ఆగస్టు 25:** ఉమ్మడి అనంత జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం స్థానిక రైతు బజార్ సమీపంలోని కృషి భవన్‌లో ఆ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్ర ప్రసాద్ ఎంపికయ్యారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకటేశులు, రాజగోపాల్, రంగస్వామి, కార్యదర్శిగా బాలాజీనాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నరసింహులు, సల్మా, సహాయ కార్యదర్శులుగా ప్రభాకర్, వీరేష్‌బాబు, హఫీజ్, పద్మావతి, కోశాధికారిగా ప్రాణేష్‌రావు, ఈసీ సభ్యుడిగా శ్రీనివాసులు, స్టేట్ కౌన్సిలర్‌గా పుల్లయ్యలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి శ్యాంసుందర్ శ్రీనివాస్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు.

## జీడిపల్లికి 1076 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**బెళుగుప్ప, ఆగస్టు 25 :** మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం 1,076 క్యూసెక్కుల కృష్ణాజలాలు వచ్చి చేరినట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.265 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

## నేటి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

**అనంతపురం క్రైం,ఆగస్టు 25 :** ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రస్సల్ సిస్టం, పీజీఆర్ఎస్)కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ జగదీష్ ఓ ప్రకటనలో తెలిపారు. 26వతేదీన శ్రీకృష్ణాష్టమి పండుగ సందర్భంగా వేదికను రద్దు చేశామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. సెప్టెంబరు 2న నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షకు

# దరఖాస్తుల ఆహ్వానం

**తిరుపతి(విద్య), ఆగస్టు 25:** జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచారకేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

| కోర్సు | ప్రవేశం | దరఖాస్తుకు చివరితేదీ |
|---|---|---|
| నవోదయ | 6వతరగతి | 16-09-2024 |
| ఆర్ఐఎంసీ | 8వతరగతి | 30-09-2024 |
| మిలటరీస్కూల్స్ | 6 నుంచి 9తరగతులు | 19-09-2024 |

# బదిలీలకు దొడ్డిదారి టీం..!

● జడ్పీలో చక్కబెడుతున్న ప్రత్యేక బృందం ● ఉన్నతాధికారుల వైఖరిపై వెల్లువెత్తుతున్న విమర్శలు



**అనంతపురం విద్య, ఆగస్టు 25 :** ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ పరిధిలో బదిలీల వేళ అనధికారికంగా ఓ బృందాన్ని రంగంలోకి దించినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జడ్పీలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు ఉన్నా...ఇతర మండలాల నుంచి ప్రత్యేకంగా వారిని దించినట్లు సమాచారం. ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వకుండా కొందరిని సీట్లలో కూర్చోబెట్టి...బదిలీల వ్యవహారాలను చక్కబెట్టాలని నోటి మాటగా ఉన్నతాధికారులు సూచించినట్లు తెలుస్తోంది. జడ్పీ కార్యాలయంలో ఉన్న వారిని కాదని బయటి వ్యక్తులను తీసుకురావడం వెనుక....వ్యాపారం కోసమేనంటూ...ఉద్యోగులు, సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఉత్తర్వులు లేకుండా ఈ టీం ఎందుకంటూ...మండిపడుతున్నారు.

### 446 దరఖాస్తులు

ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి సాధారణ బదిలీలకు ఉద్యోగుల నుంచి 446 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు 286 మంది ఉన్నారు. ఇందులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 15 మంది కాగా, సీనియర్ అసిస్టెంట్లు 25 మంది, జూనియర్ అసిస్టెంట్లు 43 మంది, టైపిస్టులు 18 మంది, డ్రైవర్లు ఇద్దరు, రికార్డు అసిస్టెంట్లు 70 మంది, ల్యాబ్ అసిస్టెంట్లు 20 మంది లైబ్రరీ అసిస్టెంట్ ఒకరు, ఆఫీస్ సబార్డినేట్స్ 89 మంది, నైట్ వాచ్‌మెన్స్ ముగ్గురు ఉన్నారు. ఐదేళ్ల పూర్తయిన వారు 286 మంది ఉండగా... వీరిలో ఇప్పటి వరకు బదిలీలకు 231 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. రిక్వెస్టు బదిలీలకు 215 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.

### పాగాకు.. పావులు

ఉమ్మడి జిల్లా కేంద్రమైన జడ్పీ కార్యాలయంలో పాగా వేసేందుకు కొందరు అధికారులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. సుమారు 15 ఏళ్ల రాప్తాడు, అనంతపురం ఎంపీడీఓ కార్యాలయాల్లో పనిచేసిన ఓ మహిళా అధికారి మళ్లీ జడ్పీలో పాగా వేయాలని చూస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా గతంలో లక్షలాది రూపాయలు ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం చేసి జైలుకు వెళ్లిన మరో అధికారి సైతం ఇక్కడికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా ఎవరిస్థాయిలో వాళ్లు పైరవీలు మొదలు పెట్టారు. మరికొందరు ఎంపీలు, ఎమ్మెల్యేల లెటర్లతో జడ్పీకి క్యూ కడుతున్నారు. దీంతో సామాన్య ఉద్యోగులు తమ అవకాశాలను తన్నుకుపోతారోనంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## టీడీపీ నాయకులపై దాడి

**ఉరవకొండ,ఆగస్టు 25:** వజ్రకరూరు మండలంలోని బోడిసానిపల్లి తండాలో టీడీపీ నాయకులపై వైసీపీ వర్గీయులు కర్రలతో దాడి చేశారు. ఈదాడిలో టీడీపీకి చెందిన భీమ్లానాయక్, శంకర్‌నాయక్, ప్రకాష్‌నాయక్, ఉమాబాయికి గాయాలయ్యాయి. పొట్టానాయక్ ఇంటి ముందున్న పూలమొక్కలను భీమ్లానాయక్‌కు చెందిన ఆవు తొక్కింది. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. వివాదం సద్దుమణిగింది. తమనే ప్రశ్నిస్తావా అంటూ పొట్టానాయక్ వర్గీయులు లక్ష్మానాయక్, రంగస్వామినాయక్, వాలునాయక్, స్వామినాయక్ మరికొంతమంది శనివారం రాత్రి భీమ్లానాయక్ కుటుంబసభ్యులపై కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో భీమ్లానాయక్ తలకు తీవ్రగాయమైంది. శంకర్‌నాయక్, ప్రకాష్‌నాయక్, ఉమాబాయి గాయపడ్డారు. బాధితులు వజ్రకరూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై హత్యాయత్నానికి పాల్పడిన వారిని శిక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన టీడీపీ నాయకులను మండల కన్వీనర్ నూతేటి వెంకటేశులు, నాయకులు ఈశ్వర్, శర్మాస్ ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించారు. టీడీపీ నాయకులపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీకి మెజార్టీ వచ్చిందన్న అక్కసుతోనే వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారని మండల కన్వీనర్ పేర్కొన్నారు.



గాయపడిన వారిని పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

## విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

● ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు ● ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

**అనంతపురం కల్చరల్, ఆగస్టు 25:** విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని యునైటెడ్ ఎలెక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెప్టెంబరు 5న తిరుపతిలోని సీఎండీ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. సూరిబాబు మాట్లాడుతూ విద్యుత్ రంగం మూడు డిస్కంలలో ఈపీడీఎల్ విశాఖపట్నం, సీపీడీసీఎల్ విజయవాడ, ఎస్పీడీసీఎల్ తిరుపతి పరిధిలో 23,500 కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పీస్‌రేట్ కార్మికులు, మీటర్ రీడర్లు, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్పీఎం హమాలీలు, ట్రాన్స్‌ఫార్మర్ రిపేరీ కార్మికులు 6వేల మంది వరకు పనిచేస్తున్నారని, ట్రాన్స్‌కో జెన్కో మూడు డిస్కంలలో 17,500 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ థర్డ్‌పార్టీ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. ఈ విధానాన్ని రద్దుచేసి ప్రభుత్వమే కార్మికులను విలీనం చేసుకుని నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగా రిక్రూట్‌మెంట్ చేసిన షిఫ్ట్ ఆపరేటర్లకు పాత కార్మికులకు ఇస్తున్న వేతనాలు వీరికి కూడా చెల్లించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేసి కాంట్రాక్టు కార్మికులందరినీ విలీనం చేసుకుని వేతనాలు, డీఏ, హెచ్ఆర్ఏ అమలు చేయాలన్నారు. ప్రతి సబ్‌స్టేషన్‌లోనూ వాచ్‌మెన్లను నియమించాలని కోరారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ చట్టాలు అమలు చేయాలని, వాటిని అమలు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని, వారి కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలన్నారు. ఆర్ఓలు పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు, రెవెన్యూ క్యాషియర్లకు ఎలాంటి ప్రభుత్వ సెలవులు మంజూరు చేయకుండా పనిఒత్తిడి వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేసే దిశలో అడుగులు వేస్తోందని, అదాని, అంబాని వంటి కార్పొరేట్ దిగ్గజాలకు అప్పగించేందుకు కుట్ర చేస్తోందన్నారు. విద్యుత్ రంగం ఎంతో కీలకమైన వ్యవస్థ అని, ఈ వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. సెప్టెంబరు 5న తిరుపతిలో చేపట్టనున్న ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారుతికుమార్, నాయకులు రామచంద్ర, మధు, మహబూబ్‌బాషా, ఎస్‌కేఎం బాషా, సెక్యూరిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాగభూషణ్‌రెడ్డి, గంగాధర్, ఖాజావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు

## డ్రా చేశాడు.. డబ్బు తీసుకోలేదు..

● ఏటీఎంలో నగదు వదిలేసిన ఖాతాదారుడు

**గుంతకల్లు, ఆగస్టు25:** పట్టణంలో ఓ బ్యాంకు ఖాతాదారుడు ఏటీఎం మిషన్‌లో డబ్బును డ్రాచేసి, ఆ డబ్బును తీసుకోకుండా వెళ్లిపోయాడు. శనివారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని కెనరా బ్యాంకు ఏటీఎంలో ఓ వ్యక్తి రూ. 5,500 డ్రాచేసి, డబ్బును తీసుకోకుండానే వెళ్లిపోయారు. బయోలైన్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న జీ బషీర్ అహ్మద్ అనే వ్యక్తి ఉదయం ఎనిమిదిన్నర ప్రాంతంలో ఆదే ఏటీఎంలో డబ్బు డ్రా చేయడానికి వెళ్లాడు. తన కార్డు ద్వారా డబ్బును తీసుకుంటుండగా ఏటీఎం యంత్రంలో ఎవరో డ్రాచేసిన డబ్బు కనిపించింది. తీసి చూడగా రూ. 5,500 ఉన్నట్లు గుర్తించారు. నాలుగవ శనివారం బ్యాంకుకు సెలవు కావడంతో బ్యాంకు అధికారులను సంప్రదించలేకపోయినట్లు ఆయన తెలిపారు. ఆదివారం, సోమవారం కూడా సెలవు దినాలు కావడంతో మంగళవారం బ్యాంకుకు వెళ్లి డబ్బును వదలి వెళ్లిన వ్యక్తి వివరాలు తెలుసుకుని వారికి అందజేస్తానని ఆయన తెలియజేశారు.

## టమోటా కిలో రూ.23

**అనంతపురంరూరల్, ఆగస్టు 25:** కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. ఆదివారం 2850 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. ఇందులో కిలో సరాసరి ధర రూ.15, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

## ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోండి

● రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

**అనంతపురం అర్బన్, ఆగస్టు 25 :** జిల్లాలో తాజాగా కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు,శాస్త్రవేత్త శిరీషలు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. నల్లరేగడి భూముల్లో ఈనెలాఖరు దాకా కంది, పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. ఎర్రనేలల్లో కంది, ఆముదం, జొన్న, సజ్జ, ఆలసంద, పెసర, కొర్ర తదితర పంటలు సాగు చేసుకోవాలన్నారు. సెప్టెంబరు 1 నుంచి నెలాఖరు వరకు ఎర్రనేలల్లో జొన్న, సజ్జ, అలసంద, ఉలవలు, కొర్ర, పెసర తదితర పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. నల్లరేగడి భూముల్లో ప్రొద్దుతిరుగుడు, జొన్న, కొర్ర, మొక్కజొన్న పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. రబీ సీజన్‌లో నల్లరేగడి పొలాల్లో పప్పుశనగ సాగు చేసే రైతులు ప్రస్తుతం పెసర, సజ్జ,ఉలవ, జొన్న, కొర్ర తదితర స్వల్ప కాలిక పంటలు సాగు చేసుకుంటే ప్రయోజనం ఉంటుందన్నారు.



తలమర్లలో నిరుపయోగంగా ఉన్న గోదాము

## నిరుపయోగంగా గోదాములు

**కొత్తచెరువు, ఆగస్టు 25 :** జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం గోదాములను నిర్మించిందే తప్పా.. వాటిని కొన్నింటిని వినియోగంలోకి తీసుకొని రాలేదు. దీంతో అవి నేటికి నిరుపయోగంగానే ఉన్నాయి. రైతులు పండించిన పంట ఉత్పత్తుల నిల్వల కోసం రూ. లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఈ గోదాములను నిర్మించింది. కొన్ని సహకార సంఘాల కేంద్రాల్లో నిర్మించిన ఈ భవనాలు ఇప్పటికి అందుబాటులోకి రాలేదు. మరికొన్ని గ్రామాల్లో గోదాముల నిర్మాణం అసంపూర్తిగానే ఉన్నాయి. కొత్తచెరువు మండలంలోని కొడపగానిపల్లిలో గోదాము నిర్మాణం పూర్తికాలేదు. తలమర్ల, మరుకుంటపల్లి, లోచర్ల వద్ద నిర్మించిన గోదాములు ఇప్పటివరకు వినియోగంలోకి తీసుకురాలేదు. ఒక్కొక్క గోదాము 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించారు. అయితే కొందరు కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేయడంతో చాలా చోట్ల గోదాములుకు నిర్మించిన తలుపులు గోడలు అప్పుడే పెచ్చులూడుతున్నాయి. అధికారులు స్పందించి గోదాములు వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

## వేమన సాహితీ యాత్ర ప్రారంభం



వేమన సాహితీ పత్రాలు విడుదల చేస్తున్న రచయితలు, కవులు

**గాండ్లపెంట, ఆగస్టు 25 :** వేమన సాహిత (బస్సు) యాత్రను కదిరి ఆర్ అండ్‌బీ బంగ్లా నుంచి ఆదివారం ప్రారంభించారు. 50 మందికిపైగా ప్రముఖ కవులు, రచయితలు ఇందులో పాల్గొన్నారు. ఈ యాత్ర ఆదివారం రాత్రి మండలంలోని కటారుపల్లెకు చేరింది. యోగివేమన ఆలయాన్ని కవులు, రచయితలు దర్శించుకున్నారు. వేమన సాహితీ పత్రాలను ఆవిష్కరించారు. బాలసాహిత్య అవార్డు గ్రహీత చదువుల బాబు ఆధ్వర్యంలో యోగివేమన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కటారుపల్లిలో వేమన నడియాన నేలపై అడుగడున సాహిత్య చైతన్యం నిండి ఉందన్నారు. ఆయన పద్యాలతో మూడ నమ్మకాలపై కలం జులిపి, ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. అలాగే నంబులపూలకుంట మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను సందర్శించారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి జయచంద్ర, విశిష్ట అతిథులుగా సాహితి వేతలు, సాహితి ప్రియ పచ్చిపుసులు సూర్యనారాయణ; డక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, ఉమ్మర్ ఫారూక్‌ఖాన్, చింతా నాగరాజు, పద్యకవి రామబ్రహ్మం, కొగిర జయచంద్రారెడ్డి, ఉపేంద్ర శంకర్‌నారాయణ రాజు, వేమన వంశస్థుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నిత్యం కరెంట్ కష్టాలు

- ఓడీసీవాసుల ఇక్కట్లు
- ట్రాన్స్‌ఫార్మర్ మార్పు.. అధికలోడ్‌తో సమస్యలు

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 25 :** స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతాల్లోని ప్రజలు నిత్యం కరెంట్ పోతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఏడాది క్రితం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో ప్రాంతానికి తరలించడం.. వశిష్ట పాఠశాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక భారం పడుతుండటంతో ఈ సమస్య తలెత్తింది. దీంతో నిత్యం కరెంట్ పోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కరెంట్ లేకపోవడంతో అనేక పనులు ఆగిపోతున్నాయి. ఇలా అధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. విద్యుత్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ప్రతి రోజూ ఈ సమస్యతో ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద తొలగించిన ట్రాన్స్‌ఫార్మర్

### ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపుతో సమస్య



గతంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న సమయంలో ఎలాంటి సమస్యా లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌ను సంవత్సరం క్రితం మరో ప్రాంతానికి తరలించిన తర్వాత ఇక్కడ సమస్యలు మొదలయ్యాయి. ఆ స్థానంలో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని పలుమార్లు అధికారులను కోరాం. అయినా వాళ్లు పట్టించుకోలేదు.

- ఎం. సునీల్‌కుమార్, ఓడీసీ

### వర్షాకాలం పెరిగిన కష్టాలు



దాదాపు సంవత్సరం క్రితం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చడంతో సమస్య మొదలైంది. లోడ్ ఎక్కువ కావడం వల్ల రోజూ కరెంట్ పోతుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం మరీ ఎక్కువగా కరెంట్ పోతోంది. మళ్లీ ఆ స్థానంలో అధికారులు ట్రాన్స్‌ఫార్మన్ ఏర్పాటు చేసి.. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి.

- జిలాన్, ఓడీసీ

## చేనేత సమస్యలు పరిష్కరించండి

**ధర్మవరం, ఆగస్టు 25:** ధర్మవరం చేనేతలు పవర్‌లూమ్స్ వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, వారిని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని చేనేత జౌళిశాఖ మంత్రి సవితను ధర్మవరం చేనేత నాయకులు చింతాశ్రీనివాసులు, చట్టాగంగాధర్ విన్నవించారు. ఆదివారం పెనుకొండలో మంత్రి సవితను కలిసి చేనేతల సమస్యలను విన్నవించారు. చేనేత రిజర్వేషన్ యాక్టు, జీఐ యాక్టు గురించి వివరించారు. అదేవిధంగా బోగస్ సహకార సంఘాల అవినీతి, అక్రమాలపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని కోరామన్నారు. ప్రతి చేనేత కార్మికునికి మూడు సెంట్లస్థలంతోపాటు ఇళ్లు, వర్క్‌షెడ్ ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని మంత్రిని కోరామన్నారు.



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ధర్మవరం నేతన్నలు

### ఘనంగా శ్రీకృష్ణాష్టమి




ధర్మవరంలో శ్రీకృష్ణ, రాధా, గోపికల వేషధారణలో చిన్నారులు

**ధర్మవరం, ఆగస్టు 25:** పట్టణంలోని సాధన పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణతో ఆకట్టుకున్నారు. దీంతో చిన్నారులతో ఉట్టికొట్టించడం, గోపికలతో వెన్నచిలికించడం తదిగర ఘట్టాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీతాపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
**నల్లమాడ :** మండలంలోని గోపేపల్లి గీతామందిరంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తామని ముత్యాపురం వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు.

## టీడీపీ కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు



కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

**పుట్టపర్తి, ఆగస్టు 25:** టీడీపీ యాప్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేసిన ఎనిమిది మంది పార్టీ కార్యకర్తలకు అనంతపురంలోని తన నివాసంలో స్థానిక ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడి ఆదివారం ప్రశంసాపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీలో కష్టపడే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు.

## జింకా రామాంజిపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

**ధర్మవరం, ఆగస్టు 25:** తనకున్న పలుకుబడితో వందకోట్ల చేనేత ప్రాజెక్టును దక్కిం చుకుని... అక్రమాలకు తెరలేపి కార్మి కుల పొట్టకొడుతున్న జింకా రామాంజినేయులుపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, శేషంపల్లి మారుతి, అయూబ్‌ఖాన్ మాట్లాడారు. జింకా రామాంజినేయులు చేస్తున్న అక్రమాలు, అరాచకాలు మితిమీరి పోతున్నాయన్నారు. ఆయన ఏర్పాటు చేసిన పవర్ లూమ్స్ ఫ్యాక్టరీలోకి ఇతర వ్యక్తులను పరిశీలన ఎందుకు అనుమతి ఇవ్వలేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జింకా రామాంజినేయులుకు నిజాయితీ ఉంటే.. తమను ఫ్యాక్టరీలోకి అనుమతించాలని, ఫ్యాక్టరీలోని నెలరోజులు సీసీ పుటేజీ బయటకు తీస్తే అందులో ఎటువంటి చీరలు తయారుచేస్తున్నారో ఆరా తీస్తామని తెలిపారు. జింకా స్వార్థం వల్ల చేనేత పరిశ్రమ పూర్తిగా కనుమరుగైందని, పవర్‌లూమ్స్ స్థానంలో అత్యంత ఆధునిక టెక్నాలజీతో కూడిన జెట్‌లూమ్స్ ఏర్పాటు చేసి చిన్నాభిన్నం కార్మికులను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. తనకు ఎటువంటి సబ్సిడీలు రాలేదంటున్న సదరు యజమాని అందుకు సంబంధించిన జీఓలు చూపాలని వారు డిమాండ్ చేశారు. ఎంతమంది స్థానికులకు ఉపాధి కల్పించారో చెప్పాలన్నారు. రామాంజినేయులు అక్రమాలపై కలెక్టర్, ధర్మవరం ఆర్డీఓలను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. త్వరలో ఫ్యాక్టరీ ఎదుట ధర్నా చేసి అక్రమాలను వెలికితీస్తామని స్పష్టం చేశారు.

## దూదేకులు రాజకీయంగా ఎదగాలి



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రముఖులు

**కొత్తచెరువు, ఆగస్టు 25 :** నూర్‌బాషా (దూదేకులు) కులస్థులు రాజకీయంగా ఎదగాలని మాజీ జడ్పీటీసీ గఫార్ పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని నూరుబాషా సంఘం కమిటీ హాల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. దూదేకులు కలిసికట్టుగా ఉన్నప్పుడే సంఘం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ఒకే పార్టీపై నిలబడాలని, దూదేకుల కులస్థులకు ఏవైనా సమస్యలు వస్తే సంఘం దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం ఉద్యోగవిరమణ పొందిన కులఉద్యోగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షుడు దాదాకలందర్, గౌరవాధ్యక్షుడు గఫార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లిబాబుసాబ్, రాష్ట్ర ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పగడాల సిద్దయ్య, అహమ్మద్, ముంటిమడుగు నబీ, బాబు, కుళ్లాయప్ప, రజాక్, అహమ్మద్, హైదర్‌వలీ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి



చిన్నవెంకటయ్య (ఫైల్)

**ధర్మవరం, ఆగస్టు 25:** స్థానిక కదిరిగేటు సమీపంలో ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌తో ఢీకొనడంతో సంజయ్‌నగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఉడుముల చిన్న వెంకటయ్య (75) మరణించాడు. చిన్న వెంకటయ్య మగ్గం నేస్తూ జీవనం సాగించేవాడు. ఆదివారం ఉదయం ఇంటి వద్ద రోడ్డు దాటుతుండగా... గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంలో వచ్చి ఢీకొట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నవెంకటయ్యను స్థానికులు, కుటుంబసభ్యులు 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### మహిళ ఆత్మహత్య

**ధర్మవరంరూరల్, ఆగస్టు 25:** మండలంలోని మల్కాపురం గ్రామంలో అపర్ణ (26) కడపునొప్పి తాళలేక శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అపర్ణకు రొద్దంకు చెందిన సురేంద్రతో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె. గత కొంతకాలంగా ఆమె కడుపునొప్పితో బాధపడుతోంది. పది రోజుల క్రితం పుట్టిళ్లు అయినా మల్కాపురానికి ఆపర్ణ వచ్చింది. కడుపునొప్పి తీవ్రం కావడంతో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని రూరల్ పోలీసులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# కొనసాగిన తాగునీటి కార్మికుల నిరసన





కొత్తపల్లి తండా పంపు హౌస్ వద్ద, తాడిమర్రిలో కార్మికుల నిరసన

**నల్లమాడ, ఆగస్టు 25 :** మండలంలోని సత్యసాయి పంపులో పని చేస్తున్న కార్మికులు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరసన ఆదివారమూ కొనసాగింది. మండలంలోని కొత్తపల్లి తండ పంపు హౌస్ వద్ద మోకాళ్లపై అర్ధనగ్నంగా నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, ఎస్ఎం బాషా, రామమోహన్, శ్రీనివాసులు, రామమోహన్‌రెడ్డి, ఓబిరెడ్డి, షామీర్, రామాంజి, కేశవ, శంకర్ పాల్గొన్నారు.
**తాడిమర్రి:** తమకు రావాల్సిన బకాయిలు చెల్లించడంతో పాటు సంస్థకు బడ్జెట్ కేటాయించాలని సత్యసాయి నీటి సరఫరా విభాగం కార్మికులు చేపట్టిన నిరసన ఆదివారమూ కొనసాగింది. ప్రజాప్రతినిధులు స్పందించి వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు.

## రజక అభివృద్ధి సంస్థ కమిటీ ఎంపిక

**ధర్మవరంరూరల్, ఆగస్టు 25:** స్థానిక శివానగర్ సమీపంలో దోబీఘాట్ వద్ద పట్టణ రజక అభివృద్ధి సంస్థ కమిటీని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అగ్రహారం ముత్యాలు ఆధ్వర్యంలో ఆదివారం ఎంపికచేశారు. పట్టణ అధ్యక్షుడిగా న్యామద్దల నరసింహులు, ఉపాధ్యక్షులు రామాంజినేయులు, శివయ్య, ఆంజనేయులు, గంగాధర్, ప్రధాన కార్యదర్శి గా బాలు, కోశాధికారిగా అక్కులప్ప, సహాయ కార్యదర్శులుగా రమేష్, మునికుమార్, శ్రీరాములు, శ్రీనివాసులు, మహిళా విభాగం సభ్యులుగా వరలక్ష్మీ, గంగమ్మను ఎంపిక చేశారు.



నూతన కమిటీ సభ్యులు

## బాధిత కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం



ఇంటిపత్రాలతోపాటు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

**ధర్మవరం, ఆగస్టు 25:** స్థానిక కేతిరెడ్డికాలనీ ఎల్-4లో వెంకటరాముడు శుక్రవారం అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 28వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి గస్తీఓంకార్, నాయకులు మాధవరెడ్డి, మహిళా నాయకురాళ్లు సుగుణమ్మ, యశోదమ్మ వెంకటరాముడి భార్యను ఆదివారం పరామర్శించారు. రూ.ఐదువేలు ఆర్థికసాయం అందజేశారు. అంతేకాకుండా బాధితురాలి ఇళ్లు తాకట్టులో ఉండగా.. సొంత నిధులు చెల్లించి వారి ఇంటి పత్రాలను విడిపించి శ్యామలమ్మ, కుమార్తెలు అలేఖ్య, అంజలికి అందజేశారు.

## లఖ్-పతి దీదీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**కదిరి అర్బన్, ఆగస్టు 25:** స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వమున్న మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్రం తీసుకువచ్చిన లఖ్‌పతి దీదీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం శారద సూచించారు. ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన 82 మంది సభ్యులకు రూ.71.30 లక్షల రుణాలందించారు. ఈ కార్యక్రమంలో సీసీలు బాబ్‌జాన్, నిర్మల, నరసింహులు, శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, సిబ్బంది, టీడీపీ నాయకులు గంగులప్ప పాల్గొన్నారు.

- కొత్తచెరువు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ప్రతి మహిళ ఈ పథకాన్ని వినియోగించుకుని లక్షాధికారిగా ఎదగాలని ఏపీఎం రవీంద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మహిళాసంఘాల సభ్యులు, ఐకేపీ సభ్యులు పాల్గొన్నారు.
- కదిరి, (అమడగూరు) : స్థానిక వెలుగు కార్యాలయంలో అమృత మహిళసంఘం లఖ్ పతి దీదీ కార్యక్రమాన్ని వీక్షించారు. ఇందులో ఎంపీఓ గోపాల్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అనుసా, సీసీలు శంకర్‌నాయక్, రత్నమయ్య, రవీంద్ర, హరిప్రసాద్, టీడీపీ కార్యకర్త చలమయ్య పాల్గొన్నారు.
- తాడిమర్రి : స్థానిక కళాజ్యోతి మండలి సమాఖ్యలో లఖ్ పథ్ దిది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బాలమ్మ ఏడాదికి రూ.లక్ష ఆదాయం పొందుతున్న మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సీసీ మస్తాన్ పాల్గొన్నారు.
- ఓబుళదేవరచెరువు: స్థానిక పల్లవి మండల సమాఖ్య కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ లఖ్ పతి దీదీ కార్యక్రమం లైవ్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రమణప్ప, సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ, కార్యదర్శి లక్ష్మీదేవి, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకులు పూల రెడ్డెప్ప, సీసీ వేణుగోపాల్, శ్రీనివాసులు, చంద్రారెడ్డి, వెంకటరమణ, హేమభూషణ్, మునియప్ప, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.




కదిరి సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం

- నల్లమాడ: స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం లఖ్ పతి దీదీ కార్యక్రమాన్ని సభ్యులు వీక్షించారు. ఇందులో ఏపీఎం జయంతి, యానిమేటర్లు, మహిళాసంఘం సభ్యులు పాల్గొన్నారు.
- నల్లచెరువు : స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం రవీంద్ర, నాయకులు లఖ్‌పతి దీదీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో కన్వీనర్ రాజశేఖర్, అబ్దుల్ ఖాదర్, ఆంజనప్ప, నాగభూషణం నాయుడు, మాబూసాబ్, అశ్వర్థనాయుడు, నాగిరెడ్డి, శ్రీరాములు, నాస్ నరసింహులు, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు

## ఏడాదిగా వెలగని వీధిదీపాలు



కొక్కంటి క్రాస్‌లో వెలగని వీధిదీపాలు

**తనకల్లు, ఆగస్టు 25 :** స్థానిక తనకల్లు, కొక్కంటి క్రాస్ ప్రాంతాల్లోని ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు ఏడాదిగా వెలగడం లేదు. సంబంధిత జాతీయ రోడ్ల విస్తరణాధికారులు తాము గ్రామ పంచాయతీకి అప్పగించామంటున్నారు. పంచాయతీ అధికారులు మాత్రం తమకేమి సంబంధం లేదంటూ చేతులెత్తేశారు. ప్రజలు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా.. పట్టించుకునే నాథుడే లేడు. ఈ కారణంగా తనకల్లు, కొక్కంటి క్రాస్ ప్రాంతాలు ఏడాదిగా అంధకారంలో మగ్గుతున్నాయి. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రశాంతి నిలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

**పుట్టపర్తి, ఆగస్టు 25:** శ్రీకృష్ణుని జన్మాష్టమి సందర్భంగా ప్రశాంతి నిలయంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లను చేస్తున్నట్టు దిశా డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం పట్టణం, ప్రశాంతినిలయంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. వేడుకలలో వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొంటారని, దీంతో ఎలాంటి సంఘటనలూ జరగకుండా, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

### గంజాయి విక్రేత అరెస్టు

**పుట్టపర్తి, ఆగస్టు 25:** జిల్లాకేంద్రంలో గంజాయిని విక్రయిస్తున్న మోకా విజయభాస్కర్‌ను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సునీత పేర్కొన్నారు. నిందితుడ్ని ఆదివారం స్థానిక ఫోర్ లైన్ రోడ్‌లోని పెట్రోల్ బంక్ పెద్ద కమ్మవారిపల్లి రోడ్ టి జంక్షన్‌లో గంజాయి అమ్ముతుండగా అరెస్టు చేశామన్నారు. అతను ధర్మవరంలో ఎరికల పెద్దన్న నుంచి కొనుగోలు చేసి తెల్పిందని, నిందితుడి నుంచి 830 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపుతున్నామని సీఐ తెలిపారు.

### కంటి వైద్యశిబిరం

**ధర్మవరం, ఆగస్టు 25:** స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. 95 మందికి ఆప్తాలమిక్ డాక్టర్ నాగేంద్ర కంటి వైద్యపరీక్షలు నిర్వహించగా అందులో 54 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణు గోపాలాచార్యులు, కార్యదర్శి రమేశ్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డి లయన్స్ క్లబ్ కోశాధికారి నాగేంద్ర, మాజీ అధ్యక్షుడు గోసే రాధాక్రిష్ణ, సభ్యులు పల్లెం వేణుగోపాల్, ఉట్టిశివప్రసాద్ పాల్గొన్నారు.

# బీజేపీ బలోపేతమే లక్ష్యం

రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్

**పుట్టపర్తి, ఆగస్టు 25:** నూతనంగా ఏర్పడిన శ్రీసత్యసాయి జిల్లాలో బీజేపీని బలోపేతం చేయడమే లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి మధుకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులో జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన నిర్వహిం చిన జిల్లా పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 1న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యాక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారని, రాష్ట్రంలో కోటి, జిల్లాలో ఆరు లక్షలు సభ్యత్వం చేయడమే లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కేంద్రాన్ని మార్చేది లేదని, ఎమ్మెల్యే బాలక్రిష్ణ మాటలను వక్రీకరించాల్సిన అవసరంలేదని అన్నారు. ఇంటింటికి బీజేపీ సభ్యత్వాన్ని తీసుకెళ్లాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బాలక్రిష్ణయాదవ్, కదిరి మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, నాయకులు దేవానంద్, లాయర్ హరికృష్ణ, మిట్టావంశీ, తలుపుల గంగాధర్, కొండమరాజు, కత్తిరాజారెడ్డి, జ్యోతి ప్రసాద్, బాలగంగాధర్, సురేంద్రబాబు, సాకే ఓబులేశు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

### లేపాక్షి శిల్పకళ అద్భుతం

**లేపాక్షి, ఆగస్టు 25:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షిలోని దుర్గా వీరభద్రస్వామి ఆలయం లో శిల్ప, చిత్రకళలు అద్భుతం గా ఉన్నాయని ఇండియన్ ఓ వర్సీస్ బ్యాంక్ ఎండీ అజయ్ కుమార్ అన్నారు. అజయ్‌కు మార్ దంపతులు ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. ఆ లయ అర్చకులు అయనకు స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. ఆల యంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆయనను దుశ్శాలువలతో సన్మానించారు. ఆయన వెంట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

## హెంజేరు సిద్దేశ్వరస్వామికి విశేష పూజలు


అలంకరణలో సిద్దేశ్వరస్వామి

**మడకశిర(అమరాపురం), ఆగస్టు 25 :** మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శ్రావణ మాస మూడో ఆదివారం పురస్కరించుకుని ఉదయాన్నే అర్చకులు శివకుమార్‌స్వామి, సిద్దలింగేశ్వరస్వామి, రవిస్వామి, గౌతమ్, ప్రదీప్ స్వామిక రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. వెండికవచంతో అలంకరించి, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిట కిటలాడింది. ఈ ప్రాంతం వాసులే కాకుండా సమీప కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ ప్రాంతాల నుంచి అధికంగా భక్తులు తరలివచ్చారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం


అలంకరణలో ముత్యాలమ్మ

**హిందూపురం, ఆగస్టు 25:** మండలంలోని మరువపల్లిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, హోమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజునాథ్, నాయకులు రామక్రిష్ణారెడ్డి, నంజుండప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.


హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

## లేపాక్షి శిల్పకళ అద్భుతం


ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఎండీ దంపతులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

**లేపాక్షి, ఆగస్టు 25 :** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షిలోని దుర్గావీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఎండీ అజయ్ కుమార్ అన్నారు. అజయ్‌కుమార్ దంపతులు ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆయనను దుశ్శాలువలతో సన్మానించారు. ఆయన వెంట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

## వ్యవస్థకు మచ్చతెచ్చేవారిని సహించం

సిబ్బందికి డీఎస్పీ హెచ్చరిక


సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ మహేష్

**హిందూపురం, ఆగస్టు 25 :** ఇప్పటి వరకు ఏం జరిగిందో అవసరం లేదని, ఇకమీదట పోలీసులు ఎవరైనా వ్యవస్థకు చెడ్డపేరుతెచ్చేలా వ్యవహరిస్తే సహించేది లేదని హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్ హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన శని, ఆదివారాల్లో సబ్‌డివిజన్ సీఐలు, ఎస్‌ఐలుసిబ్బందితో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఇదే సందర్భంలో అలాంటి వాటిలో పోలీసుల ప్రమేయం ఉందని తెలిస్తే ఇళ్లకు పంపుతానన్నారు. పోలీస్ వ్యవస్థపై నమ్మకం కుదిరేలా విధులు నిర్వహించాలన్నారు. కొంతమంది సిబ్బందిచేసే వ్యవహారాలవల్ల వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి, పేకాట, మట్కా, మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఎవరికైనా సిబ్బందికి సమస్యలుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్ అబ్దుల్ కరీం, ఎస్‌ఐలు మునీర్‌అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేత కుటుంబానికి ఆర్థిక సాయం

**హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 25 :** మండల కేంద్రంలోని వినాయక నగర్‌లో చేనేత కుటుంబానికి చెందిన పూజారి శ్రీరాములు భార్య పూజారి లక్ష్మమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించారు. సమాచారం అందుకున్న తొగటవీర క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు సీసీ హరి బాధిత కుటుంబానికి తన సహచర మిత్రులు దేవాంగం, పద్మశాలీలతో కలిసి రూ.25వేలు నగదును ఆదివారం అందజేశారు. దంపతులకు పిల్లలు లేకపోవడంతో కుటుంబాన్ని ఆదుకునేందుకు కమిటీ తరఫున ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్లకు అవగాహన

**రొళ్ల, ఆగస్టు 25 :** మండలకేంద్రంలోని బస్టాండులో సీఐ రాజకుమార్, ఎస్‌ఐ రాజశేఖర్ ఆదివారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్స్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ప్యాసింజర్లను తరలించే విషయంగా నిబంధనలు, జరిమానాలు తదితర వాటిపై వివరించారు.

## గడ్డివాము దగ్ధం

**పెనుకొండ రూరల్, ఆగస్టు 25:** ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగిసిపడి రొద్దం మండలంలోని కల్లుకుంట గ్రామంలో ఆదివారం గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఆర్ నారాయణ తనకున్న కల్లందొడ్డిలో ఆరు ట్రాక్టర్ల గడ్డివాము వేసుకున్నాడు. సమీపంలో ఉన్న చెత్తాచెదారానికి నిప్పుపెట్టడంతో ప్రమాదవశాత్తు గాలికి నిప్పురవ్వలు ఎగిసిపడి వాముపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసినట్లు అగ్నిమాపక ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. దీంతో రూ.40వేలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని కోరాడు.

## మహిళకు విద్యుత్‌షాక్

**రొళ్ల, ఆగస్టు 25 :** మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన నాగరాజు భార్య లక్ష్మీదేవి ఆదివారం పబ్లిక్‌కొళాయిలో నీటిని పట్టే సమయంలో విద్యుత్ షాక్ తగిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగరాజు కుటుంబం ఇంటిపైభాగంలో నివాసం ఉంటోంది. దీంతో వారు నీటిని అక్కడికి వదిలేందుకు సొంత మోటారును అమర్చుకున్నారు. లక్ష్మీదేవి నీటిని వదిలేందుకు మోటారు ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్ తగిలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అస్వస్థతకు గురైన ఆమెను ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందజేసినట్లు తెలిపారు.

# మూలకు చేరిన సర్వే రాళ్లు




కల్లుమర్రి హాస్టల్ ఆవరణలో పడిఉన్న భూ సురక్ష సర్వేరాళ్లు

**మడకశిర రూరల్, ఆగస్టు 25:** గత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న భూ సురక్ష పథకం కింద చేపట్టిన భూముల రీ సర్వే వల్ల తమకు భూ సమస్యలు ఏర్పడ్డాయని చాలామంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారి బాధలు ఎవరితో చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యారు. వాటిని గుర్తించిన కూటమి ప్రభుత్వం భూముల రీసర్వేను రద్దు చేసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. భూ సర్వే కోసం గతంలో తయారుచేయించిన రాళ్ల మూలన పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వం 2022 సంవత్సరంలో వైఎస్సార్ జగనన్న భూరక్ష పథకం కింద



హాస్టల్‌లో మెట్లకు, క్రికెట్ ఆటకు ఉపయోగపడుతున్న సర్వేరాళ్లు

రైతు భూములను రీసర్వే చేపట్టింది. మడకశిర మండలంలోని కల్లుమర్రి, కొత్తలం, ఉప్పార్లపల్లి, కరేసంకనహళ్లి, జాడ్రహళ్లి రెవెన్యూ గ్రామాల్లో అధికారులు భూములను రీ సర్వేచేశారు. ఈ సర్వేలో కొంతమంది రైతులకు వారికి ఉన్న భూముల కంటే తక్కువ తేలింది. తక్కువగా ఉన్న మరికొంత మందికి ఎక్కువగా ఉన్నట్లు భూముల రీసర్వేలో చూపించారు. దీనిపై అప్పట్లో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటిని గుర్తించి రైతుల బాధలను అర్థం చేసుకున్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం భూ రక్ష సర్వేను రద్దు చేసింది. ఈ నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పలువురు రైతులు వైఎస్సార్ జగనన్న భూరక్ష పేరు ఉన్న సర్వేరాళ్లను తొలగించారు. ఈ సర్వే రాళ్లను కల్లుమర్రి గ్రామంలోని హాస్టల్ ఆవరణంలో ఓ మూలన పడివేశారు. దీంతో కొన్ని రాళ్లను హాస్టల్‌లో మెట్లకోసం వేసుకున్నారు. ఆటస్థలంలో క్రికెట్ ఆడుకునేందును విద్యార్థులు ఆ రాళ్లను వాడుకుం టున్నారు. దీనిపై కల్లుమర్రి సర్వేయర్ శివరాజ్ మాట్లాడుతూ... కల్లుమర్రి పంచాయతీలో భూములను రీసర్వేచేసి నాటిన సర్వే రాళ్లను రైతులు తొలగించింది వాస్తవమే అన్నారు. ఈ విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

### సర్వే తప్పుల తడకగా ఉన్నందునే రాళ్లను తొలగించాం



గత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న భూరక్ష పేరుతో చేపట్టిన రీ సర్వేలో భూముల లెక్కలన్నీ తప్పుల తడకగా ఉన్నాయి. అందుకే కూటమి ప్రభుత్వం భూ సర్వే రద్దు చేయడంతో కొత్తగా నాటిన రాళ్లను రైతులు తొలగించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయం రైతులకు ఎంతో సంతోషం కలిగించింది. కూటమి ప్రభుత్వం తలపెట్టిన రెవెన్యూ సదస్సుల్లో రైతులకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. - నారాయణప్ప, రైతు, కల్లుమర్రి

## ప్రతి మహిళ ఓ శక్తిగా ఎదగాలి : మంత్రి సవిత

**పెనుకొండ టౌన్ :** కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందుకు ప్రతి మహిళ ఓ శక్తిగా ఎదగాలని బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ పట్టణంలోని మార్కెట్ యా ర్డులో ఆదివారం మంత్రి సవిత 25 మంది మహిళలకు కుట్టు మిషన్లు, చిరు వ్యాపారులకు 50 తోపుడుబండ్లు, వికలాంగులకు 16 ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ... ఇచ్చిన వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్ర మంలో మాజీ జడ్పీటీసీలు నారాయణస్వామి, వెంకటరమణ, సర్పంచ్ శ్రీనివాసులు, కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య, చిన్నవెంకటరాముడు, గుట్టూరు నాగరాజు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, ప్రసాద్, ట్రస్ట్ కోఆర్డినేటర్లు రమణ, సీతారామయ్యలు తదితరులు పాల్గొన్నారు.


చిరువ్యాపారులకు తోపుడు బండ్లను అందిస్తున్న మంత్రి

## పలు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన

● సమస్యల పరిష్కారంపై చర్యలు


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**మడకశిరటౌన్, ఆగస్టు 25 :** ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మడకశిర నగర పంచాయతీ పరిధిలోని చౌటిపల్లి, చాకలికుంట, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఆయా కాలనీవాసుల ద్వారా సమస్యలను తెలుసుకొన్నారు. చౌటిప ల్లిలోని బీసీ, ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు పలు సమస్యలను శనివారం సాయంత్రం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదివారం ఉదయం నగర పంచాయతీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం నాలుగు నీటి ట్యాంకులను తన సొంత డబ్బుతో అందజేశారు. సమస్యలను సత్వరం పరిష్కరించాలని, మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి చాకలికుంట, మారుతీనగర్‌లలో పర్యటించారు. కాలనీలు ఏర్పడి 15 సంవత్సరాలు గడుస్తున్నా తమను పట్టించుకున్న నాథుడు లేరని స్థానికులు ఎమ్మెల్యే వద్ద సమస్యలను ఏకరువు పెట్టారు. వీధి దీపాలు లేవని, ఇళ్ల మధ్యలో కంపచెట్లు పెరిగి వన్యప్రాణులకు ఆవాసంగా కాలనీ మారిపోతోందని తెలిపారు. వెంటనే ఆ కాలనీల్లో వీధిదీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అత్యవసరంగా మట్టివేసి రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని స్థానిక కౌన్సిలర్లకు, అధికారులకు సూచించారు. దీంతో ఆయా కాలనీ వాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## పైడేటి రోడ్డుకు మరమ్మతులు


గుంతలకు మట్టిని తోలుతున్న దృశ్యం

**హిందూపురం(పరిగి), ఆగస్టు 25 :** కొన్నేళ్లుగా పరిగి నుంచి పైడేటికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనచో దకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రమాదాలకు గురయ్యేవారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత రోడ్డు మరమ్మతులు చేపట్టాలని టీడీపీ స్థానిక నాయకులకు సూచించారు మంత్రి ఆదేశాలతో ఆదివారం టీడీపీ నాయకులు పైడేటి సర్కిల్ నుంచి కొడికొండ, శిర హైవే దాకా రోడ్డుకు మరమ్మతులు చేయించారు. మట్టిని వేసి గుంతలను పూడ్చి ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సాధికార సమితి సభ్యుడు హనుమయ్య, నాయకులు లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ నరసింహప్ప, సురేష్, చంద్ర, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారానికి చేయూత

**హిందూపురం, ఆగస్టు 25 :** పట్టణంలోని మోడల్ కాలనీలో ఉన్న మహ్మద్‌అలీ జోహార్ మునిసిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో కొంత కాలంగా నీటి సమస్య నెలకొంది. ఈ సమస్యను టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రెస్ వెంకటేశ్, మురళి కలిసి ఓవర్‌హెడ్ ట్యాంక్, మోటారు, పైపులు, కొళాయిలను పాఠశాలకు అందించారు. దీంతోపాటు విద్యార్థినులకు మరుగుదొడ్లు కట్టిస్తామని తెలిపారు. ఈ టీడీపీ నాయకులు రామాంజినేయులు, దస్తగిరిసాబ్, మహబూబ్ బాష, నగేష్, అయూబ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు రఘువీరా పరామర్శ

**అగళి, ఆగస్టు 25:** మండల పరిధిలోని పి బ్యాడిగెర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిక్కవన్నప్ప తల్లి నాగరత్నమ్మ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందారు. అదేరోజు రాత్రి మండల కేంద్రమైన అగళిలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, బలిజసంఘం నాయకుడు బలిజ దేవరాజ్ గౌడ్ తండ్రి దాసప్ప మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి ఆదివారం నాగరత్నమ్మ, దాసప్ప మృతదేహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సుధాకర్, నాయకులు బీఎన్ నరసింహమూర్తి, ఏసీ రంగనాథప్ప, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, జడ్పీటీసీ ఉమేష్ తదితరులు నివాళులర్పించారు.

## పొంచి ఉన్న ప్రమాదం

**గోరంట్ల, ఆగస్టు 25:** మండలంలోని బూదిలితండా సమీపంలో రహదారి పక్కన స్థలం ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురవడంతో ప్రమాదకర స్థితి నెలకొంది. రెడ్డిచెరువు కట్ట వద్ద నుంచి పుట్టపర్తి, బెంగళూరు రహదారిని కలుపుతూ బూదిలి గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మిం చారు. కడప జిల్లా నుంచి సిమెంటు లారీలు, ట్యాంకర్లు ఆ దారి గుండా వెళ్తుంటాయి. అదే విధంగా చెన్నై నుంచి వివిధ రకాల యంత్ర పరికరాలు, సామగ్రితో పెనుకొండ కియ పరిశ్రమ, వాటి అనుబంధ పరిశ్రమలతో పాటు బెంగుళూరుకు నిరంతరం భారీ వాహనాలు వెళ్తుంటాయి. గోరంట్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం భారీ వాహనాలు, లారీలను పోలీసులు రెడ్డిచెరువు కట్ట బైపాస్ రోడ్డు గుండా మళ్లిచండంతో... అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. అలాగే పలు గ్రామాలకు సౌకర్యంగా ఉండడంతో అన్నిరకాల వామనాలు ఇదే రహదారిపై వెళ్తుంటాయి. అయితే రహదారి పక్కన, దగ్గరకు వచ్చే వరకు కనిపించని విధంగా పెద్ద గొయ్యి ఏర్పడింది. వర్షపు నీటి కోత కారణంగా నాలుగు అడుగుల లోతు గుంత ఏర్పడింది. పొరపాటున కానీ, రాత్రిసమయంలోగానీ ఇక్కడ రోడ్డుదిగాల్సి వస్తే మాత్రం ప్రమాదం సంభవిం చే అవకాశముంది. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి రహదారి పక్కన ఏర్పడిన గుంతను పూడ్చాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



బూదిలి తండా వద్ద ప్రమాదకరంగా రహదారి

నీటి కోతవలన రోడ్డు పక్కన ఏర్పడిన గుంత

## 'మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం'


అమరాపురంలో యానిమేటర్లకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

**మడకశిర(అమరాపురం), ఆగస్టు 25:** మండలంలోని హేమా మండల సమాఖ్య భవనంలో ఆదివారం మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం అనే కార్యక్రమం నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు ప్రతి ఒక్కరూ నెలకు రూ.10వేలు ఆర్జించే విధంగా శిక్షణ ద్వారా అవగాహన కల్పిస్తామని ఐకేపీ ఏపీఎం తిప్పన్న పేర్కొన్నారు. ఇందులో భాగంగా 30 మంది యానిమేటర్లకు ఉత్తమ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హేమా మండల సమాఖ్య అధ్యక్షురాలు లలితమ్మ, ఎంపీపీ ఈరన్న, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, టీడీపీ మండల మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, ఏపీఎం సుబ్బన్న పాల్గొన్నారు.

**అగళి:** మహిళా సంఘం సభ్యుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చర్యలు చేపడుతా మని ఏపీఎం సురేష్ పేర్కొన్నారు. మహారాష్ట్ర నుంచి లైవ్‌లోప్రసారమైన ప్రధానమంత్రి మోదీ లక్పతి ప్రోగ్రాంను ఆయన ఆదివారం స్థానిక త్రివేణి మండల సమాఖ్య భవనంలో వీఓఏలకు, మహిళా సంఘాల సభ్యులకు చూపించారు. మహిళా సంఘాల సభ్యులో సంవత్స రానికి రూ. లక్షలోపు ఆదాయం ఉన్నవారిని గుర్తించి ఆపైగా ఆదాయం వచ్చేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. అలాంటి వారిని మండలంలోని 2551మందిని గుర్తించామని, మొదటి విడతలో 171మందికి బ్యాంకు రుణాలు ఇప్పించి వారి ఆదాయ అభివృద్ధికి చర్యలు చేపడుతామన్నారు. ఈ సందర్భంగా 30మంది వీఓఏలకు, 30మంది లక్పతి సభ్యులకు జడ్పీటీసీ ఉమేష్, మండల నాయకుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. కా ర్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, టీడీపీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


అగళిలో...

## కృష్ణాష్టమికి ఆలయాలు ముస్తాబు


గోరంట్లలో ముస్తాబైన మాధవరాయస్వామి ఆలయం

**గోరంట్ల, ఆగస్టు 25:** మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాలను ఆదివారం ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. గోరంట్లలోని మాధవరాయదేవాలయం, మేరెడ్డిపల్లి, కొండాపురంలోని వేణుగోపాలస్వామి ఆలయాలను మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మాధవరాయ ఆలయంలో మొదటిసారి వేడుకలు నిర్వహించ తలపెట్టారు. స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆలయకమిటీ వారు కోరారు. అలాగే పలు పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### వాసవీ ధర్మశాలలో వేడుకలు

**హిందూపురం అర్బన్:** ఇస్కాన్, బెంగళూరు వారి హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని వాసవీ ధర్మశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ హరేకృష్ణ బృందం పేర్కొంది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ఉదయం 7 గంటల నుంచి 8.30 వరకు, తిరిగి సాయంత్రం 7 గంటల నుంచి 8.30 వరకు అభిషేకాలు ఉంటాయన్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని మధు ర నుంచి చిన్ని కృష్ణుడి విగ్రహం తీసుకొచ్చి ఊరేగిస్తామన్నారు. ఆ విగ్రహానికి భక్తులు అభిషేకం చేసే అవకాశం కల్పిస్తామన్నారు. అదే విధంగా ఉయ్యాల సేవ, హారతి, మహాప్రసాదం వినియోగం ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పరమాత్ముడి కృపకు పాత్రులు కావలెనని బృందం సభ్యులు కోరారు.

## అలరించిన చిన్నారుల వేషధారణలు


శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు

**హిందూపురం అర్బన్, ఆగస్టు 25:** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని పట్టణ పరిధిలోని జ్ఞానజ్యోతి పాఠశాలలో ఆదివారం చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో అలరించారు. ఉట్టికొట్టే వేడుకలు జరుపుకున్నారు. అనంతరం శ్రీకృష్ణ లీలలు చిన్నారులకు వివరించి, బహుమతులు అందించారు.

## మతసామరస్యానికి ప్రతీక బెహలూల్‌షా దర్గా


దర్గా ముఖద్వారం

**పెనుకొండ, ఆగస్టు 25:** సర్వమత సమైక్యతకు ప్రతీకగా విరాజిల్లుతోంది హజరత్ సయ్యద్ బెహలూల్‌షా ఖాద్రీ షహీద్ దర్గా. పెనుకొండకు 2కి.మీ. దూరంలో జాతీయ రహదారి పక్కన వెలసింది. ఇరాన్ దేశంలోని ఇస్కాన్ పట్టణానికి చెందిన బాబా ఖాద్రీ తన గురువు ఆజ్ఞానుసారం పెనుకొండకు వచ్చి సర్వమత సామరస్యానికి కృషిచేసినట్లు చరిత్ర చెబుతోంది. ఆయన 1197లో బుధవారం ఇక్కడ సమాధి అయినట్లు స్థానిక కథనం.

**28న గంధం పూజ :** ప్రతి సంవత్సరం మాదిరిగానే బాబా ఖాద్రీ గంధం పూజను ఈనెల 28న బుధవారం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి షెక్షావలి తెలిపారు. అలాగే గురువారం దీపారా ధన ఉంటుందని తెలిపారు. గంధంపూజకు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తా మన్నారు. ఈ ఉత్సవానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచేకాక దేశ నలుమూలల నుంచి భక్తులు హాజరవుతారని ఆయన తెలిపారు.

## సీనియర్ ఏఎన్‌ఎంలకు తీరని అన్యాయం

● ఏపీఎన్జీఓల మహిళా విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి

**గోరంట్ల, ఆగస్టు 25:** గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలోని సీనియర్ ఏఎన్‌ఎంలకు చాల అన్యాయం జరుగుతోందని ఏపీఎన్జీఓల మహిళ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి ఆదివారం ఓప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో 30 సంవత్సరాల సర్వీసులో ఉన్న ఏఎన్‌ఎంలను కాదని, సచివాలయాల్లో కొత్త ఏఎన్‌ఎంలను నియమించారన్నారు. పైగా అప్పుడున్న అధికారులు, ప్రభుత్వ పెద్దలు తమ తప్పును కప్పి పుచ్చుకోవడానికి... అన్ని విభాగాల్లోని ఏఎన్‌ఎంలు, సిబ్బంది అధికంగా ఉన్నారనే నెపంతో రీ - డెప్లాయిమెంట్ అనే కొత్త పేరుతో సీనియర్ ఏఎన్‌ఎంలను సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. దీనిపై అప్పుడే కోర్టుకు వెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు కొత్త ప్రభుత్వం న్యాయం చేస్తుందని తాము రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి తమ గోడు విన్నవించామన్నారు. ప్రస్తుత బదిలీల్లో 18 శాఖలకు అవకాశం కల్పిస్తున్నా, వైద్య ఆరోగ్య శాఖకు ఇందులో లేదని పేర్కొనడం శోచనీయమన్నారు. అయితే సచివాలయ ఏఎన్‌ఎంలకు బదిలీలు, మ్యూచువల్ బదిలీలు కల్పించడం దారుణమన్నారు. ఐదేళ్ల క్రితం రీ - డెప్లాయిమెంట్ పేరుతో సుదూర ప్రాంతాలకు వెళ్లిన సీనియర్ ఏఎన్‌ఎంలు బదిలీల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎదురు చూస్తున్నారన్నారు. రీ - డెప్లాయిమెంట్‌ను రద్దు చేసి, తమ పాత స్థానాలకు మార్చిన తరువాత వారిని బదిలీ చేయాలని కోరారు.

## తరలిరండి..

**పావగడ, ఆగస్టు 25:** బెంగళూరులోని ఫ్రీడంపార్కులో ఈనెల 28న తలపెట్టిన కాంగ్రెస్ హటావో దళిత్ బచావో కార్యక్రమానికి పావగడ నుంచి అధిక సంఖ్యలో యువత తరలి రావాలని బీఎస్పీ నాయకుడు కెంచరాయ పిలుపునిచ్చారు. ఎస్సీఎస్టీల అభివృద్ధి కోసం కేటాయించిన రూ.26వేల కోట్ల ఎస్‌సీపీ, టీఎస్పీ నిధులను గ్యారెంటీ పథకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దారి మళ్లించి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. అందుకు నిరసనగా ఫ్రీడమ్‌పార్కులో నిర్వహించే ఈ ర్యాలీకి పావగడ నుంచి యువకులు తమ సొంత ఖర్చులతో అధిక సంఖ్యలో తరలి వచ్చి మద్దతు తెలిపాలని కోరారు.

## గుంతల రోడ్డుతో ఇబ్బందులు

**గుడిబండ, ఆగస్టు 25 :** మండలంలోని కొంకల్లు ప్రధాన రహదారి నుంచి గ్రామంలోకి వెళ్లే మట్టిరోడ్డు గుంతలమయంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మండలంలోని మేకలగట్ట, జమ్ములబండ రోడ్డు, ఆదిభైరవేశ్వరస్వామి దేవాలయం నుంచి సీసీగిరి, ఎంఎస్ తండా నుంచి సీఎన్ పాళ్యం, గుడిబండ, చిగతుర్పి నుంచి గొల్లపల్లికి వెళ్లే రోడ్లు మట్టిరోడ్లు. ఈ రోడ్లన్నీ గుంతలమయం. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలువడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. కొంకల్లులో గ్రామ సచివాలయం ఉండటంతో పంచాయతీలోని ఎస్ఎస్ గుండ్లు, పూజారిపల్లి, మేకలగట్ట గ్రామాల నుంచి పనుల నిమిత్తం వెళ్లాలంటే నరక యాతన అనుభవిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఈ గ్రామాలకు ఆటోలుకానీ, బస్సులుకానీ లేవన్నారు. ద్విచక్రవాహనాలు, కాలినడకన వెళాలని రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టిరోడ్లను బీటీ రోడ్లుగా మార్చాలని కోరుతున్నారు.


కొంకల్లు గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డులో నిలిచిన వర్షపునీరు